

ఆంధ్రజ్యోతి

నిరుద్యోగ యువతుల కోసం జాబ్‌మేళాలు

పాడేరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యువతులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రేరణ పేరిట నిర్వహించే జాబ్‌ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన గిరిజన యువతులకు టాటా ఎలక్ట్రానిక్స్‌లో టెక్నికల్‌ అసిస్టెంట్‌ పోస్టుల్లో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 8న పాడేరులో, 10న రంపచోడవరంలో, 12న ఎటపాకలో నిర్వహించే జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న వంజంగి హిల్స్



ఆదాయంపైనే దృష్టి.. అభివృద్ధి నాస్తి

వంజంగి హిల్స్‌పై కనీస వసతులు కరువు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌ తక్కువ సమయంలో విశేష పర్యాటక ఆదరణ పొందింది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అయితే దీని అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం కనీసం దృష్టి సారించలేదు. కానీ దీని ప్రవేశ రుసుము ద్వారా వచ్చే ఆదాయంతో పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది.

- హామీలే తప్ప నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- కానీ ప్రవేశ రుసుము ద్వారా వచ్చే సొమ్ముతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చేయాలని నిర్ణయం
- సర్కారు నిర్ణయంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

సహజ సిద్ధమైన సుందర సందర్శనీయ ప్రదేశంగా గుర్తింపు పొందిన వంజంగి హిల్స్‌ను అభివృద్ధి చేస్తామని గతంలో పర్యాటక శాఖ మంత్రిగా పని చేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రస్తుత ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ హామీ ఇచ్చారు. కానీ దాని అభివృద్ధికి ఎవరూ కృషి చేసిన దాఖలాలు లేవు.

రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు

వంజంగి హిల్స్‌ సందర్శకుల నుంచి ప్రవేశ రుసుముగా వసూలు చేయడం ద్వారా వచ్చిన పర్యాటక నిధుల్లో రూ.25 లక్షలతో వంజంగి, లగిశపల్లి, కాడెలి పంచాయతీల పరిధిలో పలు పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. వంజంగి పంచాయతీ పరిధిలోని స్కూల్‌ భవనాలకు మరమ్మతులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, వంజంగిలో వీధి దీపాలు, తదితర పనులను రూ.13 లక్షల 3 వేలతో చేపట్టనున్నారు. అలాగే లగిశపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రి, కాల్వలకు మరమ్మతులు, లగిశపల్లిలో వీధి దీపాలను రూ.5 లక్షల 31 వేల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. కాడెలి పంచాయతీ పరిధిలో స్కూల్‌ భవనాలకు మరమ్మతులు, సీసీరోడ్లు, కాడెలిలో వీధి దీపాలను రూ.6 లక్షల 66 వేలతో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి ఆయా అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో పర్యాటకం ద్వారా వచ్చిన సొమ్ముతోనైనా ఆయా పనులు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.



వంజంగి హిల్స్‌కు వెళ్లే రోడ్డు ఇలా..

వంజంగి హిల్స్‌ అభివృద్ధి ఊసే లేదు

వంజంగి హిల్స్‌ అభివృద్ధిపై అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికీ వంజంగి మేఘాల కొండల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు లేవు. అలాగే వంజంగి గ్రామం నుంచి కొండపైకి వెళ్లేందుకు పక్కా రోడ్డు లేదు. వంజంగి హిల్స్‌ సహజ సిద్ధంగా ఏర్పడిందే తప్ప ప్రభుత్వపరంగా అక్కడ పర్యాటకులకు గాని, స్థానికులకు గాని ఉపయోగపడే ఒక్క పనిని ప్రభుత్వం చేయలేదు. కానీ దాని ద్వారా వచ్చే ఆదాయంపై మాత్రం ప్రత్యేక దృష్టిసారిస్తోంది. కాగా ప్రవేశ రుసుము ద్వారా వచ్చిన సొమ్మును వంజంగి హిల్స్‌ అభివృద్ధికి వెచ్చించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంజంగి హిల్స్‌ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటకుల అవస్థలు పట్టవా?

- చెరువులవేనంలో నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు
- సందర్శకులకు తప్పని కష్టాలు

దాదాపు పూర్తయిన వ్యూపాయింట్‌



చింతపల్లి, ఫిబ్రవరి 6:

ఆంధ్ర కశ్మీర్‌ లంబసింగికి సమీపంలోని చెరువులవేనం పర్యాటక ప్రాంతానికి నిత్యం అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వస్తారు. మంచు అందాలను ఆస్వాదించడానికి రాత్రి లంబసింగి చేరుకుని వేకువజామున చెరువులవేనం వద్దకు వెళతారు. అయితే ఇక్కడ మరుగుదొడ్లు నిర్మించి ఐదు నెలలు గడిచినా ప్రారంభంకాకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

లంబసింగి సందర్శించే పర్యాటకులు చెరువులవేనం వ్యూపాయింట్‌ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాలుగేళ్లుగా ప్రతి ఏటా వేల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చెరువులవేనం కొండపై వ్యూపాయింట్‌, మరుగుదొడ్ల నిర్మాణానికి 2023 జనవరిలో రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టరు ఐదు నెలల కిందట చెరువులవేనం వ్యూపాయింట్‌ వద్ద మరుగుదొడ్లు నిర్మించి, రన్నింగ్‌ వాటర్‌ సదుపాయం కల్పించారు. అయితే మరుగుదొడ్లు, వ్యూపాయింట్‌ను ఒకేసారి ఎంపీ, జిల్లా అధికారులతో ప్రారంభించాలని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్‌ అధికారులు భావించారు. వ్యూపాయింట్‌ నిర్మాణాలకు తొలి విడత మంజూరు చేసిన నిధులు సరిపడకపోవడంతో ఎంపీ అదనంగా మరో రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. వ్యూపాయింట్‌ నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయింది. వ్యూపాయింట్‌ను అధికారికంగా ప్రారంభించకపోయినప్పటికి పర్యాటకులు వినియోగిస్తున్నారు. వ్యూపాయింట్‌ వద్ద నుంచి మంచు అందాలను వీక్షిస్తున్నారు. అయితే మరుగుదొడ్ల నిర్మాణం ఐదు నెలల క్రితం పూర్తయినా అధికారికంగా ప్రారంభించలేదనే కారణంతో సంబంధితశాఖ అధికారులు తాళాలు వేసి ఉంచుతున్నారు. చెరువులవేనం వద్దకు ప్రతి రోజు వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఉదయం నాలుగు, ఐదు గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వ్యూపాయింట్‌ వద్ద ప్రకృతి అందాలను వీక్షిస్తూ అక్కడే ఉంటారు. ఆ సమయంలో మల, మూత్ర విసర్జన కోసం సందర్శకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తున్నది. మహిళా పర్యాటకులు మూత్ర విసర్జనకు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. మరో నెల రోజుల్లో పర్యాటక సీజన్‌ ముగుస్తుంది. ఇప్పటికీ మరుగుదొడ్లు వినియోగంలోకి రాకపోవడంపై పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వాటిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



చెరువులవేనం వ్యూపాయింట్‌ వద్ద ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

ఏసీబీ వలలో గొలగాం పంచాయతీ కార్యదర్శి

ఆస్తి పన్ను పేరు మార్చడానికి రూ.7 వేలు లంచం డిమాండ్‌

- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

అనకాపల్లి రూరల్‌, ఫిబ్రవరి 6:

ఇంటి పన్నుకు సంబంధించి పేరు మార్చడానికి లంచం తీసుకుంటూ అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించి ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.



ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబు

గొలగాం గ్రామానికి చెందిన తోట ఈశ్వరరావు ఇటీవల ఇటీవల మృతిచెందాడు. ఇతని పేరున గ్రామంలో ఇల్లు ఉంది. తన తండ్రి పేరున ఉన్న ఆస్తి పన్నును తన పేర్ల మీదకు మార్చాలని ఈశ్వరరావు కుమారుడు బాబ్జీ ఇటీవల పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబును కలిసి కోరారు. ఈ పని చేయాలంటే తనకు రూ.10 వేలు లంచం ఇవ్వాలని, లేకపోతే పేర్లు మార్చడం కుదరదని కార్యదర్శి స్పష్టం చేశాడు. దీంతో బాబ్జీ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించి, పంచాయతీ కార్యదర్శి లంచం డిమాండ్‌ చేసిన విషయమై పిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు చెప్పిన మేరకు బాబ్జీ మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు పంచాయతీ కార్యదర్శి కనకబాబుకు ఫోన్‌ చేసి, ఆస్తి పన్ను పేర్లు మార్చడానికి రూ.7 వేలు ఇస్తానని, డబ్బులు ఎక్కడకు వచ్చి ఇవ్వాలని అడిగారు. పంచాయతీ కార్యాలయంలోనే వున్నానని అతను చెప్పాడంతో బాబ్జీ అక్కడకు వెళ్లారు. రూ.7 వేలు ఇస్తుండగా అప్పటికే సమీపంలో మాటువేసిన ఏసీబీ డీఎస్పీ రమ్య, ఇతర అధికారులు రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యదర్శి టేబుల్‌ డ్రాలో అనధికార నగదు రూ.10 వేలు ఉన్నట్టు గుర్తించి ఆ సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నారు. కార్యదర్శి కనకబాబును సాయంత్రం వరకు విచారించి అనంతరం తమ వెంట తీసుకెళ్లారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

అధికారులకు కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ సూచన

పాడేరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ సూచించారు. జిల్లాలో అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్‌ ట్రైనర్లకు ఎన్నికల ప్రక్రియపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారులు, సిబ్బంది పోలింగ్‌ రోజున పక్కాగా చేయాల్సిన పనులు, పోలింగ్‌ కేంద్రాల ఏర్పాటుపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 150 వరకు సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలున్నాయని, ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్‌ నిర్వహించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మూడు ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌లు, సూక్ష్మ పరిశీలకుడు పర్యటించి ప్రతి సంఘటనను పరిశీలిస్తారన్నారు. సెక్టోరియల్‌ అధికారుల బాధ్యతలు, విధులను కలెక్టర్‌ వివరించారు. ఎన్నికల సామగ్రిని సెక్టోరియల్‌ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్‌ కేంద్రాలకు తరలిస్తారన్నారు. పోలింగ్‌ ప్రారంభానికి గంటన్నర ముందుగానే మాక్‌ పోలింగ్‌ నిర్వహించాలని పేర్కొంటూ, మాక్‌ పోలింగ్‌ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు సక్రమంగా పని చేయకపోతే తీసుకోవాల్సిన చర్యలు, అదనపు ఓటింగ్‌ యంత్రాలు సమకూర్చడం, తదితర అంశాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా కలెక్టర్‌ వివరించారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, అంధులకు ప్రత్యేకంగా ప్రవేశం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పించాలన్నారు. పోలింగ్‌ నేపథ్యంలో ప్రిసైడింగ్‌ అధికారి డైరీ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు బహిరంగ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్‌ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులపై అధికారులు సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ భావన వశిష్ఠ, సబ్‌ కలెక్టర్‌ ధాత్రిరెడ్డి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ పి.అంబేడ్కర్‌, జిల్లా ఆడిట్‌ అధికారి సువర్ణ ఫణి, డివిజనల్‌ పంచాయతీ అధికారి పీఎస్‌ కుమార్‌, అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల మాస్టర్‌ ట్రైనర్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌, పక్కన జేసీ భావన, సబ్‌కలెక్టర్‌ ధాత్రిరెడ్డి, పాల్గొన్న అరకులోయ, పాడేరు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు

డీఈవోగా బ్రహ్మాజీరావు నియామకం

- ఎట్టకేలకు రెండేళ్ల తరువాత డీఈవో పోస్టు భర్తీ

పాడేరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యాశాఖాధికారిగా పి.బ్రహ్మాజీరావుని నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారుగా రెండేళ్లుగా స్థానిక డీఈవో పోస్టు ఇన్‌చార్జులతో కొనసాగుతున్నది. ప్రస్తుతం స్థానిక డీఈవోగా విజయనగరం జిల్లా విద్యాశాఖ ఏడీ బి.గౌరిశంకరరావు ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. ఈ క్రమంలో తాజా బదిలీల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో డిప్యూటీ డీఈవోగా పని చేస్తున్న పి.బ్రహ్మాజీరావును అల్లూరి సీతారామరాజు జిల్లాకు డీఈవోగా నియమించారు. దీంతో ఇన్నాళ్లుగా ఇన్‌చార్జులతో నెట్టుకొచ్చిన స్థానిక డీఈవో పోస్టు ఎట్టకేలకు భర్తీ కావడం విశేషం.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా తగ్గని మంచు



పాడేరు- జి.మాడుగుల మార్గంలో మంగళవారం ఉదయం పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ పొగమంచు ప్రభావం తగ్గడం లేదు. అనంతగిరిలో 14.3, అరకులోయలో 14.6, జి.మాడుగుల, ముంచంగిపుట్టులో 14.7, జీకేవీధిలో 15.4, పాడేరులో 15.6, పెదబయలులో 15.9, హుకుంపేటలో 16.5, చింతపల్లిలో 17.8 డిగ్రీల సెల్సియస్‌ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. అయితే ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు ... మిగతా 7వ పేజీలో

గిరి గ్రామదర్శినిలో రష్యన్‌ మహిళల సందడి



గిరిగ్రామదర్శినిలో గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో రష్యన్‌ మహిళలు

అరకులోయలోని గిరిగ్రామ దర్శినిని బ్రహ్మకుమారీస్‌ రష్యన్‌ మహిళా బృందం మంగళవారం సందర్శించింది. గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో వారు సందడి చేశారు. అక్కడ ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. - అరకులోయ

గోమంగి మినీ గురుకులం హెచ్‌ఎం సరెండర్‌

- ఐటీడీఏ పీవో అభిషేక్‌ ఆదేశం

పెదబయలు, ఫిబ్రవరి 6: విధులకు గైర్హాజరైన పెదబయలు పరిధిలోని గోమంగి మినీ గురుకులం ప్రధానోపాధ్యాయిని వి.చంద్రకళను ఐటీడీఏకి సరెండర్‌ చేయాలని అధికారులను పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ ఆదేశించారు. మంగళవారం మండల పర్యటనలో భాగంగా గోమంగి గ్రామంలో గల మినీ గురుకులాన్ని ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయిని చంద్రకళ విధులకు గైర్హాజరైనట్టు గుర్తించి ఆమెకు షోకాజ్‌ నోటీసు జారీ చేసి సరెండర్‌ చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మెనూ అమలు తీరుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మందుల నిల్వలపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.



మినీ గురుకులంలో విద్యార్థినుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్‌

క్రైం... crime news

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


పారుపల్లి కనకం (ఫైల్ ఫొటో)

రావికమతం, ఫిబ్రవరి 6: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మందులు వాడుతున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి రావికమతం ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని గుమ్మాళ్ళపాడు గ్రామానికి చెందిన పారుపల్లి కనకం(55) భార్య, ముగ్గురు కుమార్తెలతో నివాసముంటున్నాడు. రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అతను మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని రావికమతం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని నర్సీపట్నం తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో 108 వాహనంలో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తకోట దాటాక అతను మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6: మండలంలో గల లబ్బూరు సమీపంలో ఒక కారులో తరలిస్తున్న సుమారు 20 కిలోల గంజాయిని మంగళవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.రవీంద్ర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో లబ్బూరు సమీపంలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో బరడ నుంచి లబ్బూరు వైపు ఓ కారు వస్తుంది. పోలీసులను చూసిన కారులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఒక స్మగ్లర్ తప్పించుకున్నాడు. వారి నుంచి గంజాయితో పాటు రూ.60 వేల నగదు, ఒక కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన సిబా హంతల్, ఎలంపక గ్రామానికి చెందిన ఖిలా రమేశ్, కడగుమ్మా గ్రామానికి చెందిన ఖిలా మానస్, చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన భీష్మ హంతల్‌గా విచారణలో తేలింది. పరారైన వ్యక్తి ఒడిశాలోని కోరాపుట్టు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు తరలించారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లపై విచారణ

చోడవరం, ఫిబ్రవరి 6: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చోడవరం, మాడుగుల ప్రాంతాలకు చెందిన పలువురు యువకుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన నగర పోలీస్ కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై గత నెల 29న స్పందనలో కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ యువకుల ఫిర్యాదుపై విచారణ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. కానిస్టేబుల్, అతని సోదరుడికి ఇచ్చిన డబ్బులకు సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని బాధితులను కోరామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆధారాలు పరిశీలించిన మీదట ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అమలాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం కళాశాల నుంచి ఇంటికి వెళ్లడానికి వేచి ఉండగా, అదే గ్రామానికి చెందిన చిందాడ రాజ్‌కుమార్ వచ్చి ఇంటికి తీసుకువెళతానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత జీడితోటల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్‌కుమార్‌ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి


నిరంజన్, మణికంఠరెడ్డి (ఫైల్ ఫొటోలు)

విశాఖపట్నం, ఫిబ్రవరి 6: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృత్యువు పాలయ్యారు. నగర శివారు కొమ్మాది సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోతినమల్లయ్యపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు నీలాపువారి వీధికి చెందిన పి.నిరంజన్ (20), కె.మణికంఠరెడ్డి (21) స్నేహితులు. వీరు...మరో ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనాలపై మంగళవారం విజయనగరం పైడితల్లమ్మ దర్శనానికి వెళ్లారు. నిరంజన్, మణికంఠరెడ్డి ఒక బైక్‌పై ఉన్నారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా బోరవానిపాలెం వద్ద రహదారిపై గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఉండగా వెనుక నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో నిరంజన్, మణికంఠరెడ్డి లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో నిరంజన్ నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మణికంఠరెడ్డి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరి తల్లితండ్రులు రోజువారీ కూలీలు. చదువుకుని ప్రయోజకులవుతారనుకుంటే ఇలా అర్ధంతరంగా తమను వదిలి కడుపుకోత మిగిల్చారంటూ ఇరువురి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం కేజీహెచ్ తరలించారు. సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి రెండు వారాలు రిమాండ్

» కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు మురహరి సుబ్రహ్మణ్యం గంగారావుకు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేసి విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయిన రమణయ్యను ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుప రాడ్‌తో కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన నిందితుడిని నగర పోలీసులు సోమవారం అక్కడ అరెస్టు చేసి ఇక్కడకు తీసుకొచ్చారు. సుమారు 20 గంటలపాటు గంగారావును విచారించిన పోలీసులు...మంగళవారం కోర్టులో హాజరుపరిచగా రెండు వారాలు రిమాండ్ విధించింది.

పెదరుషికొండ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్ నిర్మించిన స్థలానికి సంబంధించి కన్వెయెన్స్ డీడ్‌ను రమణయ్య జారీ చేయలేదనే హత్యకు తెగబడినట్టు నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. తన పని చేయకుండా జాప్యం చేశారనే కోపంతో రాడ్‌తో కొట్టాలనుకున్నానని, ప్రాణాలు తీయాలని మాత్రం అనుకోలేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. తహసీల్దార్‌పై దాడి చేసిన తర్వాత ఆయన ప్రాణాలతో ఉన్నాడనే భావనతో తాను నేరుగా ఇంటికి వెళ్లిపోయానని పోలీసులకు వివరించినట్టు తెలిసింది. తహసీల్దార్ ప్రాణాలు కోల్పోయినట్టు తెలియడంతో నగరం నుంచి పరారైనట్టు తెలిపాడు. కాగా ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లడానికి ఎవరు సహకరించారు?, కన్వెయన్స్ డీడ్ పని ఎవరు అప్పగించారు?, ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని నిందితుడు రకరకాలుగా పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉన్నందున నిందితుడిని నాలుగు రోజులపాటు కస్టడీకి అప్పగించాలంటూ పీఎం పాలెం పోలీసులు కోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిసింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	104.00
లైవ్ ధర	124.00
విత్ స్కిన్	218.00
స్కిన్ లెస్	228.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

దారంతా మురుగుమయం

» సబ్బవరం ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు
» రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో అవస్థలు
» టీడీపీ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో ఇక్కట్లు


సబ్బవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సబ్బవరం, ఫిబ్రవరి 6: సబ్బవరంలోని ప్రధాన రహదారులు మురికి కూపాలుగా మారాయి. గతంలో ఇక్కడ నిర్మించిన డ్రైనేజీలు ఆక్రమణకు గురికావడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిచిపోవ డంతో ఈ ప్రాంతవాసులకు అవస్థలు తప్పడం లేదు.

సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చోడవరం వెళ్లే రోడ్డు, పెందుర్తి వైపు వచ్చే రోడ్డు, అటు అనకాపల్లి వెళ్లే రోడ్డు, జోడుగుళ్ల నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలను సైతం పూడ్చేసి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్లల్లోని వాడుక నీరు పోయే దారి లేక రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

నిలిచిన భూగర్భ డ్రైనేజీ పనులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్బవరంతో పాటు ఎనిమిది గ్రామాలను కలుపుతూ 29 కిలో మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.24.46 కోట్లు మంజూరయ్యాయి. 2018 డిసెంబరు 27న అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.


బేడ బుడగ జంగాల కాలనీ వద్ద ఇలా..

ఆక్రమణల తొలగింపు బాధ్యత రెవెన్యూశాఖదే

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణలపై సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, దీనిపై తహసీల్దార్‌కు రెండు సార్లు లేఖలు రాశామన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖ దేనని, అవసరమైతే తాము ఎక్స్‌కవేటర్లను సమకూరుస్తామని ఆయన చెప్పారు.

కారిడార్ పనులు అడ్డగింత

» డి.పట్టా, సాగుదారులకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్


పనులను అడ్డుకున్న రైతులు, టీడీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని చందనాడ రెవెన్యూ పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) భూములున్న గుల్లబట్టీల వద్ద మంగళవారం అధికార యంత్రాంగం పనులు చేపడుతుండగా రైతులు, దళితులు, టీడీపీ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం జిరాయితీ, డి.పట్టా, ప్రభుత్వ, సాగుభూములను ఏపీఐఐసీ సేకరించిందని, కానీ డి.పట్టాదారులకు, సాగులో వున్న వారికి పూర్తి న్యాయం చేయకుండా పనులు ఎలా చేపడతారని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, సీపీఎం నేత ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అధికారులే రైతుల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, పెదకాపు, సత్తిబాబు, బాబూజజీ, సిరిపిల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కల పెంపకం

» సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి


గొలుగొండ టేకు కలప డిపోలో టేకు వేలంలో పాల్గొన్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

గొలుగొండ, ఫిబ్రవరి 6: కార్పొరేట్ సంస్థల సహకారంతో పార్కుల్లో, అటవీ భూముల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నట్టు సీసీఎఫ్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి తెలిపారు. మండలంలో మంగళవారం టేకు కలప డిపోలో నిర్వహించిన వేలం పాటకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాది టేకు కలప ద్వారా రూ.8 కోట్ల 37 లక్షల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చినట్టు తెలిపారు. టేకు కలప సీపీజు ద్వారా రూ.2 కోట్ల 14 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 257 హెక్టార్లలో కార్పొరేట్ సంస్థల ఆర్థిక సహకారంతో వివిధ రకాలైన మారుజాతి ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ఐదుకోట్ల మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. విశాఖలోని ఇందిరా గాంధీ జూపార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్‌టీపీసీ చేపడుతుందన్నారు. అరకులో ఈకో పార్కు అభివృద్ధి చేశామన్నారు. తాబేళ్ల అభివృద్ధికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో గల టేకు కలప డిపోల్లో 800 క్యూబిక్‌ల మీటర్లు, విజయనగరంలో వంద, అనంతగిరిలో 140 క్యూబిక్ మీటర్ల టేకు కలప వేలానికి సిద్ధంగా వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్ సునీల్‌కుమార్, రేంజర్ శ్రీనివాస్, అటవీ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

» సాధించే వరకు అంకితభావంతో కృషి చేయాలి
» ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్
» ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో స్ఫూర్తిదాయక ప్రసంగం


ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'కల ఎప్పుడూ గొప్పగా ఉండాలి. దానిని సాకారం చేసుకునేందుకు నిరంతరం పరితపించాలి. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలవాలి. అప్పుడే విజయం దక్కుతుంది' అని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను ఉదహరిస్తూ జీవితంలో ఎలా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చో వెల్లడిం చారు. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుంటే అందుకు అనుగుణంగానే శ్రమించాలన్నారు. వాటిని సాధించే క్రమంలో ఎదురయ్యే అవాంతరాలను మనోధైర్యంతో ఎదుర్కోవాలన్నారు.

గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలి

జీవితంలో ఎత్తుపల్లాలు సహజమని, విజయం, ఓటమిని ఒకేలా తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రపంచంలోని 81 దేశాల్లో ప్రసంగాలు ఇచ్చానని, భారత్ అంటే ఇష్టమన్నారు. ఒక్క భారతదేశంలోనే తన జీవితాన్ని పార్శ్వాంశంగా చేర్చారన్నారు. దీనికి కృతజ్ఞతలను తెలిపారు. ఇప్పటివరకు భారత్‌కు ఎనిమిది సార్లు వచ్చానన్నారు.

జీవితాన్ని మార్చేది చదువే...

చదువుతోనే ఉన్నత జీవనం సాధ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే హార్డ్‌వర్క్‌తోపాటు విలువలు కూడా ముఖ్యమన్నారు. వ్యాపారం చేయడానికి, ఉద్యోగంలో చేరడానికి ముందు.. ప్రపంచాన్ని, దేశాన్ని మార్చే ఒక శక్తివన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. ఏదైనా సాధించగలమన్న నమ్మకంతోపాటు ఐకమత్యం, కృతజ్ఞత ఉన్నప్పుడే గొప్పస్థాయికి చేరుకోగలరని నిక్ స్పష్టం చేశారు.

ఏషియా బుక్స్‌లో స్థానం..

హ్యూమన్ బీయింగ్ టూ బీయింగ్ హ్యూమన్ అంటూ వందలాది మంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దీనికి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించినట్టు ఆ సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో ప్రకటించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మోడల్ స్కూల్ వద్ద ఉద్రిక్తత

» బాలికను ఓ యువకుడు తరచూ స్కూల్ నుంచి బయటకు తీసుకువెళ్లడంపై నిరసన
» పాఠశాల గేటుకు తాళం వేసి బాలిక బంధువుల ఆందోళన

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: స్థానిక మోడల్ స్కూల్ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలకు వచ్చిన బాలిక తరచూ ఓ యువకుడితో బయటకు వెళ్లి స్కూల్ విడిచిపెట్టిన తరువాత తోటి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళుతోంది. ఈ విషయం తెలిసి ఆ బాలిక తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాల గేటుకు తాళం వేసి హడావిడి చేశారు. విషయం తెలిసి ఎస్‌ఐ భీమరాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపూడి గ్రామానికి చెందిన బాలిక మోడల్ స్కూల్‌లో చదువుతోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో వర్కర్‌గా పనిచేస్తోంది. తల్లి దగ్గరకు వస్తున్న క్రమంలో అతనికి ఆ బాలికతో పరిచయం ఏర్పడింది. బాలిక స్కూల్‌కు వచ్చి పుస్తకాల బ్యాగ్‌ను విడిచి పెట్టి అతనితో కారులో వెళ్లి స్కూల్ విడిచిపెట్టే సమయానికి వచ్చి పుస్తకాలు తీసుకుని అందరి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళుతుండేది. యువకుడు సెల్‌ఫోన్‌తో ఆ బాలిక ట్యాబ్‌కు చాటింగ్ చేసి బయటకు తీసుకువెళ్లేవాడు. ఈ విషయాన్ని బాలిక బంధువులు గమనించారు. దీంతో మంగళవారం ఆ పాఠశాల వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్ సంధ్యారాణితో వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ భీమరాజు అక్కడికి వచ్చి వారికి నచ్చజెప్పారు. దీనిపై ఆయన విచారణ జరుపుతున్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు వద్దు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్


బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో గ్రామ/ వార్డు వలంటీర్లను వైసీపీ తరుపున వినియోగించుకోవాలనుకోవడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బు నుంచి వలంటీర్లకు జీతాలు చెల్లిస్తున్నారని, అటువంటి వలంటీర్లు వచ్చే ఎన్నికల్లో వైసీపీ అండగా వుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఎక్కడా ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ, వైసీపీ పాలకులు స్థానిక అధికారులపై ఒత్తిడి తెచ్చి వలంటీర్లతోనే ఓటర్ల జాబితాల సవరణ చేయించారని ఆయన ఆరోపించారు. వలంటీర్లను ఎన్నికల విధులు విధులు అప్పగిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని నాగజగదీశ్ స్పష్టం చేశారు.

కార్శి చెరకుకు కొరడా తెగులు బెడద

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 6: చెరకు కార్శి చేసుకునే రైతులు వీలైనంత త్వరగా పొలం అంతటినీ ఒకేసారి మోడు చెక్కి కార్శి చేయాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్శి తోటలకు ముఖ్యంగా విశ్వామిత్ర వంటి రకాలకు కొరడా తెగులు ఆశించవచ్చని చెప్పారు. దీనిని నివారించడానికి ప్రొపికోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి, కార్శి మోడు చెక్కిన వెంటనే పిచికారీ చేయాలని సూచించారు. వేసవిలో నువ్వు సాగు చేయాలను వారంలోగా విత్తుకోవాలని చెప్పారు. మినుము, పెసర, కంది వంటి అపరాల పంటల్లో చిత్తపురుగుల నివారణకు క్లోరిఫైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఎంఈవో-2 సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక


ఎంఈవో-2 నూతన కార్యవర్గం

కొత్తూరు (అనకాపల్లి), ఫిబ్రవరి 6: మండల విద్యా శాఖాధికారుల (ఎంఈవో) సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం కొత్తూరులో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో-2ల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షునిగా పి.ఎస్.ఎన్.మూర్తి (మాకవరపాలెం), ప్రధాన కార్యదర్శిగా బి.విశ్వేశ్వరరావు (బుచ్చెయ్యపేట), కోశాధికారిగా బి.శివనాయుడు (మునగపాక), గౌరవ అధ్యక్షుడిగా వి.ఎస్.ఎన్.మూర్తి (సబ్బవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈవో-2లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

రావికమతం, ఫిబ్రవరి 6: మేజరు పంచాయతీ కొత్తకోటలో శ్రీవల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ,చతుర్థ స్థానాల్లో చుక్కపల్లి, ఎం.కోటపాడు, కూండ్రం, సింహాద్రిపురం గ్రామాలకు చెందిన ఎడ్ల బళ్లు నిలిచాయి.

అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


అంతర్ జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 6: శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి జరుగనున్న 14వ అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంటుకు అనకాపల్లి జిల్లా జట్టును మంగళవారం ఇక్కడ రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అడ్‌హక్ కమిటీ వైస్ చైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. 16 మందిని ఎంపిక చేసిన అనకాపల్లి జిల్లా జట్టులో సీహెచ్.కుసుమ, కె.మహేశ్వరి, కె.లలిత, ఝాన్సీ శైలజ, ఎం.పూర్ణిమ, రమ్య, తరుణశ్రీ, జె.గాయత్రి, కె.శ్రావ్య, పి.లాస్యప్రియ, బి.నిహారిక, ఎస్.జాహ్నవి, ఎం.భవాని, ఎన్.దుర్గ, డి.వర్షిణి వున్నారని, కోచ్‌గా శ్రీకర్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏబీఎల్.రాజు, నేవీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీసు అధికారులకు సత్కారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6: జిల్లా నుంచి బదిలీ అయిన పలువురు పోలీసు అధికారులను సోమవారం రాత్రి పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సత్కరించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, కోటిబాబులకు వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఉత్తమ సేవలు అందించి శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, వి.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు

అడిషినల్ ఎస్పీ అనిల్‌కుమార్‌కు సత్కారం

పాడేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరం వెళుతున్న అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.అనిల్ కుమార్‌ను స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆయనకు జ్ఞాపికను అందించి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ సేవలను ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎల్.హిమగిరి, ఎల్.నారాయరావు, ఎం.తిరుపతిరావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డవరంలో తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రం

» పోలీసు సహకారంతో తెరిపించిన సీడీపీవో



పోలీసుల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తీయించిన దృశ్యం

కొయ్యూరు, ఫిబ్రవరి 6: బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ తాళాలు వేసిన దొడ్డవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం పోలీసుల సహకారంతో సీడీపీవో విజయలక్ష్మి తెరిపించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తిచేసి ఐదేళ్లు గడిచినప్పటికీ బిల్లు చెల్లించలేదనే కారణంతో కాంట్రాక్టరు రాజబాబు సోమవారం దొడ్డవరం అంగన్‌వాడీ కేంద్రం భవనానికి తాళం వేసిన విషయం తెలిసిందే. దీంతో కేంద్రం నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ విషయమై మంగళవారం సీడీపీవో పోలీసుల సహకారం తీసుకుని దొడ్డవరం వెళ్లి కాంట్రాక్టరు వేసిన తాళం బద్దలుకొట్టించి కేంద్రం తెరిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు ఐసీడీఎస్ నిధుల నుంచి రూ.లక్ష చెల్లించాల్సి ఉందని, తాను ఇక్కడికి రాకముందే పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బకాయి బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.

మాదిగలను వాల్మీకులుగా గుర్తించాలని ర్యాలీ



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏజెన్సీ మాదిగలు

పాడేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మాదిగలను వాల్మీకులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన తమకు కులాల గుర్తింపులో అన్యాయం జరిగిందని పేర్కొంటూ మంగళవారం ఏజెన్సీ మాదిగలు జిల్లా కేంద్రం పాడేరులో ర్యాలీ నిర్వహించారు. తాము ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ, ఆవిధమైన గుర్తింపు లేకపోవడంతో అన్యాయమైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు తమకు న్యాయం చేయాలని ఏజెన్సీ మాదిగలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ మాదిగుల సంఘం వ్యవస్థాపకుడు ఎం.పిచ్చయ్య, నేతలు ఎత్తుల దామోదర్, విజయకుమార్, ముసలి బాబు, ధారబాబు, జయలక్ష్మి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం





శేషగిరిరావు.... గిడ్డి వరలక్ష్మి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 6: విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ సమావేశంలో అల్లూరి జిల్లా ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సంఘం నాయకులు మోహన్‌రావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సీకరి శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శిగా గిడ్డి వరలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శేషగిరిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాతానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఓపీఎస్ అమలు, జీవో నంబరు 117 రద్దు, 12వ పీఆర్సీ హామీలను అమలు చేయకుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు.

పాత పెన్షన్ సాధన కోసం ఉద్యమిస్తాం

» యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తామని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు స్పష్టం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం రాష్ట్రంలో అనేక సార్లు వివిధ రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అనే కొత్త పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనని అన్నారు. ఈ నేపథ్యంలో పాత పెన్షన్ న్యాయమైన డిమాండ్ కోసం యూటీఎఫ్ మరో పోరాటానికి సిద్ధమైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు, మండల ప్రధాన కార్యదర్శి సీసా గోపి, గౌరవ అధ్యక్షుడు యం.అప్పలనాయుడు, కోశాధికారి కూడా శ్రీనివాసమూర్తి, కార్యవర్గ సభ్యులు పుండరీ, ధనుపతి, గణేష్, సుబ్బారావు, క్రిష్ణ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా తగ్గని మంచు

... 5వ పేజీ తరువాయి



ముంచంగిపుట్టులో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మంచు

కురుస్తున్నది. ఆ సమయంలో ఏజెన్సీలో రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాయి. మధ్యాహ్నం ఒక మోస్తరుగా ఎండ తీవ్రత పెరిగింది.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో చలి తీవ్రత పెరిగింది. ముంచంగిపుట్టులో మంగళవారం ఉదయం 10 గంటల వరకు పూర్తి స్థాయిలో మంచు తెరలు వీడలేదు. 10 గంటల తరువాత సూర్యుడు కనిపించాడు. చలి తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు వణికిపోతున్నారు.

కొత్త ఓటర్లకు అవగాహన కల్పించండి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పక్కన నాయకులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 6: మొదటి ఓటును చంద్రబాబునాయుడుకు వేసేలా కొత్త ఓటర్లకు అవగాహన కల్పించాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సూచించారు. మంగళవారం ఆమె నివాసంలో సీబీఎన్ యువ నాయకుడు గబ్బాడ సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కొత్త ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో కొత్త ఓటర్లను గుర్తించి తెలుగుదేశం పార్టీ గతంలో గిరిజన ప్రాంతాభివృద్ధికి అమలు చేసిన పథకాలను, అధికారంలోకి వచ్చాక చేపట్టే ఆరు పథకాలను వివరించడంతో పాటు వైసీపీ అరాచక పాలనపై ప్రచారం చేయాలని కోరారు. తద్వారా టీడీపీపై వారిని ఆకర్షితులను చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక యువతకు కల్పించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించి, వారి మొదటి ఓటును తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేటట్టు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, డప్పోడి వెంకటరమణ, అల్లంగి సుబ్బలక్ష్మి, స్వర్ణలత, కొండలరావు, భీంబాబు, పిన్నయ్య, రాము, భీమన్న పాల్గొన్నారు.

శాంతిభద్రతలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

ఐటీడీఏ పీవో అభిషేక్.. మారుమూల ఎర్రబయలు గ్రామంలో పర్యటన



గిరిజనులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్, పక్కన ఏఎస్పీ ధీరజ్

పెదబయలు, ఫిబ్రవరి 6: శాంతిభద్రతలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ హెచ్చరించారు. పెదబయలు మండలంలోని మారుమూల ఇంజరి పంచాయతీ ఎర్రబయలు గ్రామంలో మంగళవారం పోలీసులతో కలిసి ఆయన పర్యటించారు. ఇటీవల ఎర్రబయలు, వనుగుపల్లి, గొందిపల్లి గ్రామస్థుల మధ్య జరిగిన గొడవలపై పీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులతో పీవో మాట్లాడుతూ వివాదాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోవాలి తప్ప గొడవలు, అల్లర్లు సృష్టించి ఇళ్ల మీదపడి ధ్వంసం చేసి భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. ధ్వంసానికి గురైన ఇళ్లకు ళ్కు నష్టపరిహారం ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. మరలా ఇటువంటి చర్యలకు పాల్పడితే 144 సెక్షన్ అమలు చేయాల్సి వస్తుందని పీవో హెచ్చరించారు. ఈ సమస్యను పంచాయతీ పరిధిలోనే ఎందుకు పరిష్కరంచలేదని పెద్దలను ప్రశ్నించారు. ఎవరికి వారు కొట్టుకుంటే ప్రభుత్వ వ్యవస్థ ఎందుకని మండిపడ్డారు. ఇకపై ఇలా చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కే.ధీరజ్, సీఐ రమేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు

» అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్





కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శివకిశోర్... ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువతులు

చింతపల్లి, జనవరి 6: గిరిజన ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్టు అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. స్థానిక యువత శిక్షణ కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం టాటా టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల అధ్యపకులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధి నుంచి 450 మంది యువతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది గిరిజన ప్రాంతం నుంచి 70 మంది యువతులకు ఉసుర్ టాటా టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించామన్నారు. కంపెనీలో ఉద్యోగులు ఐఫోన్ తయారీలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఉద్యోగికి హెల్త్ ఇన్సురెన్స్, పీఎఫ్ సదుపాయం కల్పించడంతో పాటు నెలకు రూ.17-20 వేల వేతనం అందజేస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఉచిత భోజన, వసతి కంపెనీ ఏర్పాటు చేస్తున్నదన్నారు. ఈ సదుపాయాలు ప్రస్తుతం ఎంపికైన యువతులకు టాటా టెక్నాలజీస్ కంపెనీ కల్పిస్తుందన్నారు. స్వగ్రామాలను విడిచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందని చింతించాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన ప్రతి యువతికి కంపెనీ, పోలీసుశాఖ ప్రత్యేక భద్రత కల్పిస్తుందన్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా విధుల్లో చేరిన యువతుల యోగా క్షేమాలను పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 18-30 సంవత్సరాలు కలిగిన ఇంటర్ ఉత్తీర్ణులైన యువతులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువతులకు టాటా టెక్నాలజీస్ కంపెనీ దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీ చదివిస్తుందన్నారు. టాటా టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలు లభించడం శుభపరిణామని, ఎంపికైన యువతులు ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాడేరు, రంపచోడవరంలో ఇంటర్వ్యూలు

రెండో విడత ఇంటర్వ్యూలు ఈ నెల 8న పాడేరులో, 10న రంపచోడవరంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఏర్పాటు చేశారని అదనపు ఎస్పీ శివకిశోర్ తెలిపారు. చింతపల్లి ఇంటర్వ్యూలకు హాజరుకాలేని యువతులు పాడేరు, రంపచోడవరంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంతి కళాశాల కరస్పాండెంట్ ప్రసాద్, సీఐ కె.రమేశ్, సబ్ డివిజన్ పరిధి ఎస్ఐలు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి మహాప్రభో..

» గొడుగులమ్మబంద గ్రామస్థుల నిరసన



ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని కోరుతున్న గిరిజనులు

కొయ్యూరు, ఫిబ్రవరి 6: ఉపాధి లేక ఊరు వదిలి వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయని, గ్రామంలో తక్షణమేపనుల కల్పించాలని మంప పంచాయతీ గొడుగులమ్మబంధ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం వారంతా నిరసన తెలిపారు. సుమారు 10 కుటుంబాల వారు నివసిస్తున్న ఈ గ్రామంలో జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులు కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే క్షేత్ర స్థాయిలో వీఆర్పీ, టీఏలకు పలు పర్యాయాలు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీంతో స్థానికంగా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన దుస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఉపాధి పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన వారందరికీ స్థానికంగా పనులు కల్పించి పుణ్యం కట్టుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పథకం ఏపీవో రాజును సంప్రదించగా ఈ గ్రామంలో జి.మాడుగుల మండలం నుంచి వచ్చి నివాసం ఉంటున్నారని, వారికి జాబ్‌కార్డులు ఆ మండలం నుంచి షిప్టింగ్ చేయడంలో సాంకేతికపరమైన ఇబ్బంది కారణంగా పని కల్పించలేకపోయామని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించి అందరికీ పనులు కల్పిస్తామని ఆయన వివరించారు.

డీటీఎఫ్ రజతోత్సవాలు విజయవంతం చేయాలి

చింతపల్లి, ఫిబ్రవరి 6: విశాఖపట్నంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే డీటీఎఫ్ రజతోత్సవాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై డీటీఎఫ్ ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు ఉద్యమాలను నడిపించిందన్నారు. 2014లో పాడేరు ఐటీడీఏ టీడబ్ల్యూ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతంచేసి తగిన గుణపాఠం చెప్పిందన్నారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విలీనీకరణ పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో 49 పాఠశాలలను మూసివేసిందని, డీటీఎఫ్ ఉద్యమంతో మూసివేసిన పాఠశాలలను తెరిపించుకున్నామన్నారు. జీవో నంబరు-3కి తూట్లు పొడుతన్నా ఆదివాసీ ఉపాధ్యాయులకు దక్కని పదోన్నతులను సాధించుకోగలిగామన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయ సమస్యలపై సంఘటితంగా ఉద్యమిస్తామన్నారు. డీటీఎఫ్ రజతోత్సవాలకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరుకావాలని ఆయన కోరారు.

రా.. కదలిరా కార్యక్రమం సూపర్ సక్సెస్

టీడీపీ, జనసేన నేతలు అప్పలరాజు, రొబ్బా మహేష్

మాడుగుల, ఫిబ్రవరి 6: రా.. కదలిరా చంద్రబాబు సభ సూపర్ సక్సెస్ అయ్యిందని, ఆ సభకు వచ్చిన ప్రజాదరణ చూసి వైసీపీ నాయకులకు మైండ్ బ్లాకైందని టీడీపీ మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం నిర్వహించిన రా.. కదలిరా చంద్రబాబునాయుడు సభకు నాయకులు, కార్యకర్తలు, రెండు పార్టీల కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా రావడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం కావడం జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన ఉమ్మడిగా నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమానికి అసలు ప్రజలే రాలేదని తప్పుడు సంకేతాలను పంపించేలా పోస్టింగ్‌లు పెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, రాజ్‌కుమార్, ఇళ్లపు రమేష్, పుప్పాల రమేష్, సూర్యనారాయణరాజు, శ్రీమూర్తి, జల్లి సూర్య ప్రకాష్, రాకేటి నూకరాజు, దర్శిశెట్టి అప్పలరాజు, పిల్లా సోమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతిపై టీడీపీ ప్రత్యేక దృష్టి

» పార్టీ మండల అధ్యక్షుడు బలరాం



జర్రెలలో టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న పార్టీ నాయకులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6: ఆదివాసీల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టిసారించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ పరిధిలో మంగళవారం బాబు షూరిటీ.. భవిష్యతు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపుకు అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందని చెప్పారు. అలాగే పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం కింద ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు, మహిళలకు ప్రతీ ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, వారికి ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు చప్పున అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, మండల కార్యదర్శి కె.జగత్‌రాయ్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి అడికటియ తిరుపతి రావు, సర్పంచులు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, నాయకులు శంకరావు, కామేశ్వరరావు, బాబూజీ, మజ్జి చిన్ని, వంతాల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు వైసీపీ ప్రభుత్వానికి పట్టవా?

» సీపీఎం జిల్లా నాయకుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి, ఫిబ్రవరి 6: ఎస్సీ కాలనీల్లో నివాసం ఉంటున్న దళితులు సమస్యలు వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని సీపీఎం జిల్లా నాయకుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మండల కేంద్రంలోలోని ఎస్సీ కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించి, దళితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు నుంచి గిరిజన ప్రాంతంలో ఎస్సీ కాలనీల్లో దళితులు నివాసముంటున్నారన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో సుమారు 250 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో రక్షిత నీటి పథకం, సీసీ రోడ్లు నిర్మించారని, ఇప్పటి వరకు దళితుల సంక్షేమం కోసం వైసీపీ ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. దళితుల్లో ఏ ఒకరికి పక్కా గృహాలులేవన్నారు. పూర్వం ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే చిన్న గృహం నిర్మించుకుని రెండు, మూడు కుటుంబాలు నివాసమంటున్నాయన్నారు. బాలబాలికలకు సరైన విద్య అందడంలేదన్నారు. దళితుల సమస్యలు సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా..

రోడ్డు భద్రత నియమాలను పాటించండి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 6: వాహనాలను నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారంతా లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరలించాలన్నారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లు వినియోగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి బి.శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ పీవో జి.గౌరీశంకరరావు, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రాజేశ్వరావు బాధ్యతలు

కొయ్యూరు, ఫిబ్రవరి 6: కొయ్యూరు తహసీల్దారుగా డి.రాజేశ్వరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన తిరుమలరావుకు విజయనగరం బదిలీ కావడంతో, అతని స్థానంలో విజయనగరం జిల్లా బొబ్బిలి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేశ్వరావు బదిలీపై వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరరావుకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

ఎంపీడీవో చంద్రరావు బాధ్యతల స్వీకారం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 6: ఎంపీడీవోగా జి.చంద్రరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా బామిడి మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో చెప్పారు.

కాంగ్రెస్ సభను జయప్రదం చేయాలి

ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ, ఫిబ్రవరి 6: చింతపల్లిలో ఈ నెల 10న జరగనున్న కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి పాచిపెంట శాంతకుమారి పిలుపునిచ్చారు. ముంచంగిపుట్టు మండలంలోని దోడిపుట్టు పంచాయతీ, డుంబ్రిగుడ మండలంలోని గుంటసీమలో మంగళవారం ఆమె పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చింతపల్లిలో జరనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ హాజరవుతారని, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కకోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.నీలకంఠం, ఎం.ప్రేమ్‌కుమార్, వి.సాధురాం, పి.అతిథి, వి.జగన్, కె.పడాల్, సోమేశ్వరరావు, చిన్నస్వామి, జగన్నాథం, మితుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

కొయ్యూరు, ఫిబ్రవరి 6: మండలంలోని కంఠారం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిర్వాసితులైన కుటుంబాల వారికి తోడు ది లోకుల గాంధీ ట్రస్టు ప్రతినిధులు మంగళవారం చేయూతనందించారు. బాధితులకు వంట పాత్రలు, నిత్యావసర సరకులు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుం టామని, ఎవరూ అధైర్యపడకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు లోకుల రమేష్, మఠం మురళీకృష్ణ, గౌరీనాయుడు, శివ, రాజు, సతీష్, కిరణ్, బీజేపీ మండల అధ్యక్షుడు అప్పరాజు, స్థానిక నేతలు గాడి సత్యనారాయణ, గాడి శ్రీరామూర్తి పాల్గొన్నారు.

'చలో విజయవాడ'కు తరలిరండి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 6: చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశా కార్యకర్తలతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఆటుపోట్లు ఎదుర్కొని వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం విచారకరమని వాపోయారు. ఇందుకు నిరసనగా చేపడుతున్న విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, మేరి పాల్గొన్నారు.

ఎన్నికల విజయవంతానికి కృషి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 6: సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని తహసీల్దార్ ఎం.అరుణకుమారి కోరారు. కార్యాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విజయవంతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం మండలంలోని సుమారు 25 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను ఆమె గుర్తించారు.

ఘాట్ రోడ్డులో కారు, బస్సు ఢీ

» ఆరుగురికి స్వల్ప గాయాలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 6: పాడేరు ఘాట్ రోడ్డులో మంగళవారం కారు, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఆరుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి పాడేరు వస్తున్న పీటీడీ బస్సు, పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న కారు ఏసుప్రభు మలుపుకు సమీపంలో ఢీకొన్నాయి. దీంతో ఘాట్‌లో సుమారు గంట పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ధారాలమ్మ ఆలయం పునర్నిర్మాణానికి కొలతలు

సీలేరు, ఫిబ్రవరి 6: గూడెంకొత్తవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి మంగళవారం దేవదాయ శాఖ డీఈఈ కె.కృష్ణ ఆధ్వర్యంలో కొలతలు తీశారు. ఆ ఆలయం నిర్మించి 50 ఏళ్లు పైబడడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో రూ.50 లక్షల సీజీఎస్ నిధులను దేవాదాయ శాఖ మంజూరు చేయడంతో ఆలయ మండపం, గర్భగుడి నిర్మాణం చేపట్టడానికి నిర్ణయించారు. ఆలయ నిర్మాణ పనులను మాగమాసంలో చేపడతామని ఈ సందర్భంగా దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు, ఏఈ వీవీ శివప్రసాద్, ధారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజక్ గొర్లి గణేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చింతపల్లి, ఫిబ్రవరి 6: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.వీరసాయిబాబు తెలిపారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.